ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 05.03.2026 సమయం. 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఫెడరేషన్ ఇంటర్నేషనల్ హాకీ వరల్డ్ క్వాలిఫై విమెన్ హాకీ టోర్నమెంట్ నిర్వహణతో అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ ప్రాముఖ్యత మరింత పెరగబోతోందని క్రీడ శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.
2. నాంపల్లి రైల్వే స్టేషన్ ఆధునీకరణ తర్వాత హైదరాబాద్ కు మరో తలమానికంగా నిలవబోతోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.
3. తెలంగాణ నుంచి రాజ్యసభ అభ్యర్థులుగా కాంగ్రెస్ తరఫున అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఈరోజు నామినేషన్లు దాఖలు చేశారు.
4. మూసీ ప్రక్షాళనపై కాంగ్రెస్ ప్రభుత్వం తీరును బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు ఆక్షేపించారు.

**వాకిటి శ్రీహరి**

హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈనెల 8 నుంచి నిర్వహిస్తున్న ఫెడరేషన్ అంటర్నేషనల్ హాకీ వరల్డ్ క్వాలిఫై విమెన్ హాకీ టోర్నమెంట్ 2026 తో అంతర్జాతీయు స్థాయిలో హైదరాబాద్ ప్రాముఖ్యత మరింత పెరగబోతోందని క్రీడ శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఈ పోటీల్లో భారత్ తో పాటు ఇంగ్లాండ్, కొరియా, ఇటలీ, ఆస్ట్రియా, స్కాట్లాండ్, ఉరుగ్వే, వేల్స్ దేశాల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నారని వెల్లడించారు. ఈ సాయంత్రం హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ... ఆయా దేశాల నుంచి వచ్చే క్రీడాకారులకు మన రాష్ట్రంలోని వారసత్వ ప్రదేశాల పర్యటన రూపొందించామని

చెప్పారు. ఈ పోటీల కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో ఆస్ట్రోటర్ఫ్ మైదానం సిద్ధం చేశామని పేర్కొన్నారు. ఫెడరేషన్ ఇంటర్నేషనల్ డీ హాకీ, హాకీ ఇండియాతో పాటు పలు రాష్ట్ర ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేసుకుంటూ తెలంగాణ క్రీడా ప్రాదికార సంస్థ అన్ని సదుపాయాలు సమకూరుస్తోందని తెలిపారు. ఇప్పటికే పలు దేశాల క్రీడాకారిణులు నగరానికి చేరుకున్నారని, ప్రాక్టీస్ కొనసాగుతోందని అన్నారు. తెలంగాణను స్పోర్ట్స్ హబ్ గా రూపొందించే చర్యల్లో భాగంగా ఇటీవల నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీల్లో ఆరు లక్షల మందికి పైగా క్రీడాకారులు పాల్గొనడం ఒక రికార్డని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఛైర్మన్ శివసేనారెడ్డి, ఎండీ బాలా మాయాదేవి పాల్గొన్నారు.

జీఎస్

**కిషన్ రెడ్డి**

నాంపల్లి రైల్వే స్టేషన్ ఆధునీకరణ తర్వాత హైదరాబాద్ కు మరో తలమానికంగా నిలవబోతోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఈరోజు నాంపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ... 350 కోట్ల రూపాయలతో స్టేషన్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేలా పనులు జరుగుతున్నాయని, 16 లిఫ్టులు, 8 ఎస్కలేటర్లు, అత్యాధునిక పార్కింగ్, అధునాతన రెస్టారెంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 2027 చివరి నాటికి ఈ పనులన్నీ పూర్తవుతాయని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 47 వేల కోట్ల రూపాయలతో రైల్వే నెట్‌వర్క్ విస్తరణ జరుగుతోందన్నారు. రాష్ట్రంలో మరో 384 కిలోమీటర్ల మేర కవచ్ టెక్నాలజీని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ ద్వారా స్థానిక వస్తువులకు ప్రోత్సాహం అందిస్తూ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో తెలంగాణ రైల్వే రంగం సరికొత్త పుంతలు తొక్కుతోందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

బైట్ ... కిషన్ రెడ్డి

పిటిసి, హైదరాబాద్

**రాజ్యసభ-నామినేషన్లు**

తెలంగాణ నుంచి రాజ్యసభ అభ్యర్థులుగా కాంగ్రెస్ తరఫున అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి సమర్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తో పాటు పలువురు మంత్రులు నామినేషన్ల దాఖలు కార్యక్రమంలో పాల్గొన్నారు. సిట్టింగ్ ఎంపీగా ఉన్న సింఘ్వీ పేరును అధిష్ఠానం ముందే ఖరారు చేయగా, రెండో స్థానం కోసం వేం నరేందర్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. అందరితో సత్సంబంధాలు ఉన్న నరేందర్ రెడ్డి పేరుపై ఎవరూ అభ్యంతరం తెలపకపోవడంతో సీఎం ప్రతిపాదనకే ప్రాధాన్యం లభించిందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

డెస్క్

**మల్లికార్జున ఖర్గే**

హైదరాబాద్ పర్యటనకు విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను రాజ్యసభ అభ్యర్థులు అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, తదితర నాయకులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ప్రెస్ నోట్

**పొన్నం ప్రభాకర్**

మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్ లో హైదరాబాద్ జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జిల్లా కలెక్టర్, అధికారులతో జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ రేపు సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. ఈనెల 6 నుండి జూన్ 12 వరకు జరగనున్న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో చేయాల్సిన అంశాలపై మంత్రి దిశా నిర్దేశం చేస్తారు.

ప్రెస్ నోట్

**అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి రేపు హైదరాబాద్ హైటెక్ సిటీలోని శిల్పకళా వేదికలో తెలంగాణ రాష్ట్ర మాదిగ ఎంప్లాయిస్

ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం జరుగుతుందని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు మాదిగ సామాజిక వర్గానికి చెందిన పలువురు ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు.

పిటిసి, జగిత్యాల

**జూపల్లి కృష్ణారావు పర్యటన**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు రేపు జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఏర్పాటు చేసిన క్యాంపును మంత్రి ప్రారంభిస్తారు. నిర్మల్, మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తారు.

ప్రెస్ నోట్

**కిషన్ రెడ్డి**

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సనత్‌నగర్ నియోజకవర్గంలోని చాచా నెహ్రూ నగర్ బస్తీలో పర్యటించి ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాల్యవివాహాలకు వ్యతిరేకంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... ప్రస్తుతం జీహెచ్ఎంసీ ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం వల్ల బస్తీల్లో వీధి దీపాలు, డ్రైనేజీ పూడికతీత వంటి కనీస సౌకర్యాలు కరువయ్యాయని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యవేక్షణలోని మున్సిపల్ శాఖ తక్షణమే స్పందించి వర్షపు నీటి కాలువల పునరుద్ధరణ చేపట్టాలని కోరారు. నగరంలో పెరుగుతున్న డ్రగ్స్, గంజాయి వినియోగం యువతను నిర్వీర్యం చేస్తోందని, ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డెస్క్/పిటిసి, హైదారాబాద్

**కేటీఆర్**

మూసీ పరివాహక ప్రాంతాల్లో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కే. తారక రామారావు ఈరోజు పర్యటించారు. నాగోల్ లోని STPని సందర్శించిన రామారావు, మూసీ ప్రక్షాళనపై కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై విమర్శలు చేశారు. అభివృద్ధి పేరుతో పేదల ఇళ్లను కూల్చడం సరికాదని, భూములు తీసుకోకుండా తక్కువ ఖర్చుతోనే సుందరీకరణ చేయాలని డిమాండ్ చేశారు. మురుగు నీటి శుద్ధిపై తాము అప్పట్లోనే విజన్‌తో పని చేశామని, నేడు ప్రభుత్వం పేదలను రోడ్డున పడేస్తోందని విమర్శించారు.

పిటిసి, హైదరాబాద్

**మంత్రి సీతక్క**

రాష్ట్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం కింద 2023-24 ఆర్థిక సంవత్సరానికి గ్రామ పంచాయతీలకు టైడ్ కాంపొనెంట్ క్రింద 245 కోట్ల రూపాయలు విడుదల చేసినట్లు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ దివ్యా దేవరాజన్ తెలిపారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి బేసిక్ అన్‌టైడ్, టైడ్ గ్రాంట్స్ కింద 640 కోట్ల రూపాయలకు పైగా విడుదల చేసినట్లు ఆమె వెల్లడించారు. అదేవిధంగా, గ్రామ పంచాయతీలకు అందుబాటులో ఉన్న నిధుల నుంచి మల్టీ పర్పస్ వర్కర్ల వేతనాలు చెల్లించాలని సూచించారు.

ప్రెస్ నోట్

**ఇంటర్మీడియట్**

రాష్ట్రంలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఈరోజు ప్రథమ సంవత్సరం మ్యాథమేటిక్స్-IB, జువాలజీ-I, హిస్టరీ-I పరీక్షలు జరిగాయి. మొత్తం 4 లక్షల 29 వేల 6 వందల మంది విద్యార్థులకు గానూ.. 4 లక్షల 17 వేల 656 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 11 వేల 944 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. 97.21 శాతంగా పరీక్షకు హాజరైనట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి ఒక ప్రకటనలో తెలియజేశారు. పెద్దపల్లి, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఒక్కో మాల్-ప్రాక్టీస్ కేసులు కూడా నమోదైనట్లు పేర్కొన్నారు.

డెస్క్

**10వ తరగతి హాల్ టికెట్లు**

ఈనెల 14 నుంచి ప్రారంభమయ్యే 10వ తరగతి పరీక్షల హాల్ టికెట్లను వాట్సాప్ ద్వారా పొందవచ్చని పరీక్షల విభాగం డైరెక్టర్ పీవీ శ్రీహరి తెలిపారు. ‘8096958096 అనే వాట్సాప్ నంబర్‌కు హాయ్ అని మెసేజ్ పంపిస్తే, వెల్‌కమ్ టూ మీ సేవ అని రిప్లై వస్తుంది. తర్వాత (**SSC HALL TICKET MARCH-2026**) అని పంపిస్తే.. ఒక లింక్ వస్తుంది. ఆ లింక్‌ను ఓపెన్ చేసి జిల్లా, మండలం, పాఠశాల పేరును ఎంచుకొని.. విద్యార్థి పేరు, పుట్టిన తేదీ నమోదు చేస్తే హాల్‌టికెట్ వస్తుంది. దాన్ని ఇంటర్‌నెట్ కేంద్రం లేదా మీ సేవా కేంద్రానికి వెళ్లి ప్రింట్ తీసుకోవచ్చని ఆయన తెలిపారు.

ప్రెస్ నోట్